



పుట్టపర్తి పెద్దబజార్ నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటికై మహిళల కన్నెర్ర

పుట్టపర్తి, లేపాక్షిలో నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్, లేపాక్షి

వేసవి ప్రారంభం కావడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రం అవుతోంది. ఈ సమస్యను తాళలేక కాలనీవాసులు ఆందోళన బాట పడుతున్నారు. శుక్రవారం నాడు పుట్టపర్తి మున్సిపాల్టీ పరిధిలోని పెద్ద బజారు, లేపాక్షి మండలం కల్లూరు ఎస్సీ కాలనీ వాసులు నీటి సమస్య తీర్చాలి రోడ్డుపై బైఠాయించి ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు.


పుట్టపర్తి క్రైం: పుట్టపర్తి మున్సిపాల్టీ పరిధిలోని పెద్ద బజారులో నీటి సమస్య తీవ్రమైంది. సమస్యను తీర్చాలని పలుమార్లు స్థానికులు అధికారుల వద్ద మొర పెట్టుకున్నా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో చేసేది లేక ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కొన్ని నెలలుగా కాలనీకి నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. నీటి కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు అందరూ ఇంటి వద్దనే ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చొరవ చూపి తక్షణమే నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్పందించారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

లేపాక్షి : మండల పరిధిలోని కల్లూరు ఎస్సీ కాలనీలో నీటి సమస్య తీర్చాలని కోరుతూ గ్రామ ప్రధాన కూడలిలో మహిళలు రోడ్డు పైన బైఠాయించి ధర్నా నిర్వహించారు. గత కొంత కాలంగా తమ కాలనీకి తాగు నీరు రావడం లేదన్నారు. పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారం చేయాలని కోరారు. ఈ సమస్యపై సర్పంచి స్పందిస్తూ ఎస్సీ కాలనీకి నీటిని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలియజేశారు.



లేపాక్షి మండలం కల్లూరు ఎస్సీ కాలనీల్లో నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వైసిపిలో.. వేరుకుంపట్లు..!



◆ 'అనంత', రాయదుర్గం పురపాలికల్లో అసమ్మతి సెగలు
◆ చైర్మన్, మేయర్ మార్పు అంటూ ప్రచారాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారం పోయింది... గత సార్వత్రిక ఎన్నికల్లో ఎప్పుడూలేని విధంగా వైసిపి ఓటమిని చవిచూసింది. ఇలాంటి పరిస్థితుల్లో దీని నుంచి గట్టెక్కేందుకు ఐక్యంగా నిలబడాల్సిందిపోయి... వేరు కుంపట్లు పెట్టుకుంటున్నారు. ఇది అధికార తెలుగుదేశంకు సానుకూలంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపురం నగర పాలక సంస్థ, రాయదుర్గం పురపాలక సంఘంలో వైసిపి పాలకవర్గంగా ఉంది. ఆ పార్టీ మద్దతుదారులకు పూర్తిస్థాయి మెజార్టీ ఉండటంతో అధికార మార్పిడి జరిగే అవకాశం లేదు. అయితే ఐదేళ్లవ వైసిపి సొంత కార్పొరేటర్లు, కౌన్సిలర్లే రెండుగా విడిపోయి అసమ్మతిని రాజేస్తుండటం గమనార్హం. దీన్ని అధకార తెలుగుదేశం పార్టీ వారికి అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాల్లో ఉంటోంది.

రాయదుర్గంలో బహిరంగంగా గ్రూపు తగాదాలు

రాయదుర్గం పురపాలక సంఘంలో అత్యధిక మెజార్టీ వైసిపికి ఉంది. మున్సిపల్ చైర్మన్‌గా పోరాళ్ల శిల్ప ఉన్నారు. ఆమెకు వ్యతిరేకంగా ఒక గ్రూపు ఉంది. కౌన్సిల్ సమావేశాల్లోనే బాహాటంగా ఇరువర్గాలు ఘర్షణకు దిగుతున్న సందర్భాలూ ఉన్నాయి. ఇంతటి వివాదం నడుస్తున్నా కౌన్సిలర్ల మధ్య సయోధ్య కుదుర్చాల్సిన నియోజకవర్గ సమన్వయకర్త కనిపించడం లేదు. దీంతో కొంత మంది నియోజకవర్గ నాయకులు సమన్వయకర్తను మార్పు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధిష్టానం ఈ విషయంపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురు చూస్తున్నారు.

'అనంత'లో చెలరేగే...ఆగిన మంటలు

అనంతపురం నగర పాలక సంస్థ పాలకవర్గంలో చీలికలొచ్చాయి. నగర మేయరు వసీంపై అవిశ్వాసం ఏర్పాటు చేయాలని వైసిపి కార్పొరేటర్లే ప్రయత్నాలు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం 18 మందితో సంతకాలు కూడా తీసుకున్నారు. అవిశ్వాసం పెట్టడానికి మూడొంతులు మెజార్టీ అవసరం కానుంది. అంత మెజార్టీ వచ్చే పరిస్థితులేకపోవడంతోపాటు, పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి జోక్యం చేసుకుని అందరినీ సమన్వయపరిచి అవిశ్వాస సెగలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఇక అవిశ్వాసం పెట్టడం సాధ్యంకాదని తేలిపోవడంతో సంతకాలు చేసిన వారందరూ మేయర్ వద్దకు చేరడం గమనార్హం. దీంతో అనంత కార్పొరేషన్‌లో అధికార మార్పిడికి అవకాశం లేకుండాపోయింది. ఈ మొత్తం వ్యవహారాన్ని టిడిపి జాగ్రత్తగా గమనిస్తూ వచ్చింది. మార్పు చేయాలంటే వారికి ఆ పార్టీ తరుపున గెలుపొందిన ఒక్క కార్పొరేటరూ లేకపోవడంతో మౌనంగా ఉండన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో నడుస్తోంది. వైసిపి నుంచే చీలికొచ్చి తమవైపు మెజార్టీ వస్తే అప్పుడు చూద్దామన్నట్లు గమనిస్తూ ఉంది.

ఇంకా ఏడాది గడువు..

స్థానిక సంస్థల పదవీకాలం ముగియడానికి మరో ఏడాది సమయముంది. ఇటువంటి తరుణంలో వైసిపిలో నెలకొన్న ఈ గందరగోళం రానున్న ఎన్నికలకు తమకు లాభిస్తుందని అధికార టిడిపి ఎదురు చూస్తోంది. ఆ పార్టీలో అనైక్యత నెలకొంటే ఎన్నికల్లో తాము లాభపడవచ్చునని భావిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓటమిని చవిచూసిన వైసిపి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమిష్టిగా ఏ రకంగా ఎదుర్కొనుందన్నది చూడాల్సి ఉంది.



అశ్వవాహనంపై శ్రీవారు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అశ్వవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 13వ రోజు శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు స్వామి వారు అశ్వవాహనంపై తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 10.30 గంటల నుంచి స్వామి వారి ఉత్సవం కార్యక్రమం జరిగింది.

కూటమి పాలనలో హజ్‌యాత్రకు ఆటంకాలు

ప్రజాశక్తి-హిందూపురం

విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం మైనార్టీల కోసం ఏర్పాటుచేసిన ఎంబార్కేషన్ పాయింట్‌ను తొలగిస్తూ కూటమి ప్రభుత్వం ముస్లిములకు కావాలనే ఆటంకాలు సృష్టిస్తోందని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ విమర్శించారు. విజయవాడలో హజ్ ఎంబార్కేషన్ తొలగించడం ఎన్డీయే ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనమని ఆరోపించారు. దీనిపై విమానయాన శాఖ మంత్రి, ముఖ్యమంత్రి స్పందించి ఎంబార్కేషన్ సెంటర్‌ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

పులమతిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూముకుంట చెక్ పోస్టులో వాసవ్య మహిళా మండలి విప్రోకేర్స్ సహకారంతో నిర్వహిస్తున్న కుశల్ హెల్త్ కేర్ వైద్యులు పులమతి గ్రామంలో శుక్రవారం నాడు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 61మంది మహిళలకు పరీక్షలను నిర్వహించి, వారికి అవసరమైన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ అనూష, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు శరణ్య ఎంపిక

ప్రజాశక్తి-ముదిగుబ్బ



పట్టణానికి చెందిన వట్టిపల్లి రఘునాథశాస్త్రి కుమార్తె శరణ్య జాతీయ స్థాయి అండర్-15 బేస్ బాల్ పోటీలకు ఎంపికైంది. శరణ్య స్థానిక విశ్వ భారతి పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. నెల్లూరులో జరిగిన బేస్‌బాల్ అండర్-15 రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరఫున పాల్గొంది. ఈ నెల 28వ తేదీ పంజాబ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటుంది. శరణ్యతో పాటు కోచ్ నర్సింహనాయక్‌ను విశ్వభారతి స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఆరోగ్య సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా।। ఫైరోజా బేగం సూచించారు. శుక్రవారం హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో ప్రసూతివార్డుతో పాటు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, ల్యాబ్ నిర్వహణ, మందుల పంపిణీ తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో మెడికల్ ఏజెన్సీలు, మందుల షాపులపై విజిలెన్స్, డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు, ఈగల్ బందాలు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించాయి. పట్టణంలోని నాగశ్రీ, జనతా, బంద మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనల అతిక్రమణలపై కేసులను నమోదు చేశారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్స్‌పెక్టర్ హనుమన్న, విజిలెన్స్ సిఐ సద్గురుడు మాట్లాడుతూ ఆపరేషన్ గరుడలో భాగంగా ఈగల్ టీం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రగ్ కంట్రోల్ సిబ్బంది స్థానిక పోలీసుల సహకారంతో దాడులను నిర్వహించామన్నారు. మత్తును కలిగించే మందులను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మడం నేరమని తెలిపారు. మెడికల్ షాపు నిర్వాహకులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్స్ అమ్ముతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారి వాసు ప్రకాష్, వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్, ఈగల్ టీం ఫరద్ ఖాన్ పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

ప్రజాశక్తి-పెనుకొండ



గూడ్స్ రైలు పట్టాలు తప్పిన సంఘటన శుక్రవారం మండలంలోని మక్కాజిపల్లి రైల్వేస్టేషన్ వద్ద చోటుచేసుకుంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాలు.. బెంగళూరు వైపు నుంచి ధర్మవరం వైపు వెళ్తున్న ఓ గూడ్స్ రైలు గుట్టూరు సమీపంలోని మక్కాజిపల్లి రైల్వేస్టేషన్ వద్దకు రాగానే రెండు చక్రాలు పట్టాలపై నుంచి పక్కకు ఒరిగాయి. గమనించిన లోకో పైలెట్ అప్రమత్తమై గూడ్స్‌రైలును ఆపేశారు. అనంతరం బెంగళూరు నుంచి దాదాపు 200 మంది రైల్వే సిబ్బంది, ఇంజినీర్లు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని క్రేన్ సాయంతో పక్కకు ఒరిగిన రైలు చక్రాలను సరి చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ధర్మవరం-పెనుకొండ మధ్య వచ్చే రైళ్లను పుట్టపర్తి మీదుగా దారి మళ్లించారు. మధ్యాహ్నం 1 గంటకు ట్రాక్ సరి చేయడంతో ఈ మార్గంలో రైళ్లను యథావిధిగా నడిపారు.

పన్నులు చెల్లించకపోతే ఆస్తులు జప్తు : కమిషనర్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలో ఇంటి, నీటి, డ్రెయినేజీ పన్నులు దాదాపు రూ. 4 కోట్లు వసూలు కావాల్సి ఉందని, పన్నులు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహులు స్పష్టం చేశారు. వారు శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో పలు అపార్ట్‌మెంట్స్, కమర్షియల్ షాపులను సందర్శించి ఇంటి పన్నులతో పాటు నీటి, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పన్నులు చెల్లించాలని సూచించారు. ఈ నెలాఖరు లోపు రూ. 4 కోట్లు వసూలు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పన్నులు చెల్లించని వారి గృహాలకు నీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కనెక్షన్లు నిలిపివేశామన్నారు. నెలాఖరు లోపు పన్నులు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలను స్వీకరిస్తాం

కలెక్టర్ టిఎస్.చేతన్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టిఎస్.చేతన్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల అధికారులతో కలిసి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అవసరమైన సూచనలు, సలహాలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ముందుగానే ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, మార్పులు, చేర్పులు, తొలగింపు, ఓటర్ల సంఖ్య అనుగుణంగా నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు వంటి అంశాలపై చర్యలకు భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. 29-11-24వ తేదీ నుండి 21-3-25 వరకు ఫారం-6 స్వీకరించబడిన దరఖాస్తులు 3676, ఫారం-7 నందు 1193 ఫారం-8లో 6938 దరఖాస్తుల స్వీకరించినట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటికి 14,12,177 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పురుషులు 7,01,586, స్త్రీలు 7,10,527, ట్రాన్స్ జెండర్లు 64 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 1576 మొత్తం పోలింగ్ స్టేషన్లో సంఖ్య ఉన్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ఓటర్ల జాబితా, స్వచ్ఛకరణ, మార్పులు, చేర్పులు తొలగింపు, ఓటర్ల సంఖ్య అనుగుణంగా, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ప్రతిపాదనల అంశాలపై చర్యలకు భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు జాబితాపై తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయ సారధి, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జాకీర్ హుస్సేన్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫారంపాండ్స్ గ్రౌండింగ్ పనులు

ప్రతి గ్రామంలోనూ ఫారంఫండ్స్ గ్రౌండింగ్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం, పల్లె పండుగ కార్యక్రమంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని కోర్ట్ హాల్‌లో వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి కలెక్టర్ టిఎస్.చేతన్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలోనూ 3 నుంచి 5 ఫారంఫండ్స్ పనులను గ్రౌండింగ్ జరగాలన్నారు. జిల్లాలో 7760 లక్ష్యం కాగా, ఇప్పటిదాకా 1784 ఫారంఫండ్స్ మంజూరు కాగా, 840 పూర్తి అయ్యాయన్నారు. పశువుల షెడ్లు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా నెలాఖరులోపు పూర్తి చేయాలని డ్వామా పీడీని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, జెడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, డిపిఒ సమత, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలో నిర్మాణాలను వ్యతిరేకిస్తూ ఆందోళన

ప్రజాశక్తి-చిలమత్తూరు




ఆందోళన విరమించాలని సర్పంచి, పంచాయతీ కార్మికులను కోరుతున్న ఎస్ఐ

మేజర్ పంచాయతీ స్థలంలో నిర్మాణ పనులను వ్యతిరేకిస్తూ శుక్రవారం సర్పంచి సంధ్య పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు. పంచాయతీ సంత మార్కెట్ స్థలంలో హాస్టల్ భవన నిర్మాణం కోసం మార్కింగ్ వేస్తుండగా వారు అడ్డుకున్నారు. సర్పంచి మాట్లాడుతూ పంచాయతీ అనుమతి లేకుండా గ్రామ సభ తీర్మానం చేయకుండా పంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ సంత మార్కెట్ స్థలాన్ని హాస్టల్ భవన నిర్మాణానికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. సర్పంచి ఆందోళనకు సిఐటియు నాయకులు, పంచాయతీ కార్మికులు సంఘీబావం తెలిపారు. నాయకులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న హాస్టల్ భవనాల్లో రెండు మూతపడగా మరొకటి విద్యార్థులు లేక మూతపడే దశకు చేరుకుందన్నారు. ఒక వేళ హాస్టల్ అత్యవసరమైతే వృథాగా ఉన్న ఆ భవనాలను అభివృద్ధి చేసి అందులో నిర్వహించాలన్నారు. పంచాయతీ ఆధీనంలో ఉన్న ఈ కొంత స్థలంలో భవనాలు నిర్మిస్తే మార్కెట్ ఎక్కడ నిర్వహిస్తారని ప్రశ్నించారు. కూరగాయల మార్కెట్‌లో అనేక మంది చిరు వ్యాపారులు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా దాని ద్వారా వచ్చే పన్నుత కార్మికుల వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. ఇక్కడ భవనాలు నిర్మించి కార్మికుల పొట్ట కొట్టవద్దన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మునీర్‌అహ్మద్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్ది చెప్పారు. అనంతరం హాస్టల్ భవన నిర్మాణం ఆపాలని డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్‌కు సర్పంచి సంధ్య కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని డిటి తెలిపారు.

మొరాయించిన తాగునీటి సరఫరా మోటార్

గొల్లపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన ఛైర్మన్, కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం



అధికారులకు ఆదేశాలు ఇస్తున్న ఛైర్మేన్ రమేష్ కుమార్

హిందూపురం పట్టణానికి నీరు అందించే గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద మోటార్ మొరాయించింది. శుక్రవారం తెల్లవారుజామున మోటార్ చెడిపోవడంతో హిందూపురానికి నీటి సరఫరా ఆగిపోయింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్మన్ డి.ఈ.రమేష్ కుమార్, కమిషనర్ సంఘం శ్రీనివాసులు అధికారులతో కలిసి గొల్లపల్లి రిజర్వాయర్, పంపు హౌస్‌లను పరిశీలించారు. సాంకేతిక నిపుణులతో మరమ్మతులపై చర్చించారు. అనంతపురం నుంచి మెకానిక్‌లను పిలిపించి మాట్లాడారు, వేసవికాలంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా తక్షణ మరమ్మత్తులు చేయించాలని, అందుకు అవసరమైన సామాగ్రి, ఇతరత్రా వాటిని వెంటనే సమకూర్చనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ మోహన్, మున్సిపల్ కౌన్సిలర్లు సతీష్ కుమార్, ఆయూబ్, దుర్గా నవీన్ పాల్గొన్నారు.

దళితుల ఇళ్లు కూల్చివేత దుర్మార్గం

◆ విమల ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణం
◆ కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి-హిందూపురం

దళితులు ఆర్థికంగా అభివద్ధి చెందుతారని గ్రహించి కూటమి ప్రభుత్వం గోరంట్ల మండలం పొదిలి గ్రామంలో రోడ్డు పక్కన దళితుల ఇళ్లను దుర్మార్గంగా కూల్చివేస్తోందని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ విమర్శించారు. ఇళ్ల కూల్చివేతను తట్టుకోలేక బూదిలి గ్రామంలో విమల అనే మహిళ ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూదిలి గ్రామంలో విమల ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విచారకరం అన్నారు. ఈ గ్రామంలో రోడ్డు పక్కన దళితులు ఇంటి నిర్మాణం చేసుకుని, చిన్నచిన్న వ్యాపారాలతో ఆర్థికంగా అభివద్ధి చెందుతారన్న ఈర్షతో కూటమి ప్రభుత్వం వారి నివాసాలను కూల్చివేయించిందన్నారు. ఉన్న ఇంటిని కోల్పోయి, ఆర్థికంగా చితికిపోయిన విమల ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన విమల కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారాన్ని అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బూదిలో 42 ఇళ్లఉన్న దళిత కాలనీని కూల్చి వేయాలని చూస్తే కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నివాసముంటూ, పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ నాయకులు ఈశ్వరమ్మ, గంగప్ప, సరస్వతి, గంగమ్మ, చంద్రమ్మ, రాయుడు, వెంకట్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వన్నేరప్ప



బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కెఎల్ వన్నేరప్ప, ప్రధాన కార్యదర్శిగా పివి.రామచంద్రప్ప ఎన్నికయ్యారు. ఇటీవల బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారి కేసీ.రఘునాథ్ రెడ్డి నోటిఫికేషన్ విడుదల చేశారు. అధ్యక్ష స్థానం కోసం వన్నేరప్ప, కెహెచ్.గోపాల్ నామినేషన్ దాఖలు చేయగా ప్రధాన కార్యదర్శి స్థానం కోసం పివి.రామచంద్రప్ప, కృష్ణమూర్తి, మురళి పోటీ పడ్డారు. సీనియర్ న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులతో చర్చించి ఏకగ్రీవంగా ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో వన్నేరప్ప అధ్యక్షులుగా, పివి రామచంద్రప్ప ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను ఏపీపీ ఇందాద్, సీనియర్ న్యాయవాదులు నాగరాజు, ఎ.నాగరాజు రెడ్డి, రామిరెడ్డి, శివశంకర్ తదితరులు పూలమాలలు వేసి అభినందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

'పది' పరీక్షలకు 99.51 శాతం హాజరు

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల కు 99.51 శాతం విద్యా ర్థులు హాజరయ్యారని డిఇఒ జి.కృష్ణప్ప, జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లాజర్ తెలిపారు. మొత్తం 104 కేంద్రాల్లో ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించగా 21,381 మందికి 21,277 మంది విద్యార్థులు హాజరు కాగా 104 మంది గైర్హాజరయ్యారు. అలాగే ప్రయివేటు విద్యార్థులు 15 మందికి గానూ (53.33 శాతం) 8 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్(అపాస్) విద్యార్థులు 11 కేంద్రాల్లో పరీక్షలు రాయగా 518 మందికి గానూ (81.85 శాతం) 424 మంది హాజరు కాగా 94 మంది గైర్హాజర య్యారు.

144 సెక్షన్ ఆంక్షలు అమలు

బత్తలపల్లి : పదో తరగతి పరీక్షలు ముగిసే వరకూ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఆంక్షలు అమలు చేసినట్లు ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ తెలిపారు. స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సిఐ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పరీక్ష జరిగే రోజుల్లో కేంద్రంలోని సమీపంలో జిరాక్స్ సెంటర్లు, టీ దుకాణాలు మూసివేయాలన్నారు. ఎవరైనా విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి లేనిదే పరీక్ష కేంద్రంలోకి ఎవరినీ అనుమతించబోమన్నారు.

కెజిబివిల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

జిల్లా వ్యాప్తంగా ఉన్న కెజిబివిల్లో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్(http://apkgov.apcfss.in)లో దరఖాస్తు చేసుకోవాలని ఎపి ఎస్ఎస్ఎ జిల్లా అధికారి దేవరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 కెజిబివిల్లో 6 వతరగతి -1200, 11వ తరగతి 1200 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వివరాలకు టోల్ ఫ్రీ నెం. 18004258599, ఎజిసిడిఒ 91005 99960 లను సంప్రదించాలన్నారు.

విఆర్‌కు కొత్తచెరువు సిఐ ఇందిర

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సిఐ ఇందిరపై పలు అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఎస్పీ వి.రత్న విచారణ చేయించి అనంతపురం విఆర్‌కు బదిలీ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈమె ఇక్కడ సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈమె స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయకపోవడంతో పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెను బదిలీ చేశారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కమిటీలు

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం అన్ని ప్రభుత్వ శాఖలతో కలిపి మండల టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ సభ్యులు మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు, ప్రభుత్వ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహమూర్తి, ఎస్ఐ నరేంద్ర, ఫారెస్ట్ ఆఫీసర్, ఇరిగేషన్ ఏఈ గౌతమ్ నారాయణ, రోడ్లు, ఎండోమెంట్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

మడకశిర : రొళ్ల మండలంలోని ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్మన్‌గా తహశీల్దార్, మిగిలిన శాఖల ఉన్నతాధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ షెక్షావలి, ఎస్ఐ వీరాంజనేయులు, ఇతర కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి-తాడిమర్రి


ఎంపిడిఒ ఎ.రంగారావుకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఒ ఎ.రంగారావుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ పరిధిలోని సుమారు 30 రకాల పనుల పర్యవేక్షణకే సమయం చాలడం లేదని దీనికి తోడు సచివాలయ సిబ్బందితో కలిసి మరో 20 రకాల సర్వేలను తమతో చేయించడంతో పని వత్తిడి పెరిగి సతమతమవుతున్నామన్నారు. కావున పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగించాలని వినతి పత్రంలో కోరారు.

శ్మశానవాటిక స్థలాలను ఆన్‌లైన్ చేయాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలోని కొత్తచెరువు, లింగారెడ్డిపల్లి, బైరాపురం, కంచెట్టిపల్లి, తదితర గ్రామాల్లో గతంలో శ్మశానవాటికలకు కేటాయించిన స్థలాలను తక్షణమే చూపి ఆన్‌లైన్ చేయాలని కోరుతూ శుక్రవారం పుట్టపర్తి డివిజన్ డివిఎంసి మెంబర్ ఎస్.రామాంజనేయులు తహశీల్దార్ నీలకంఠారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ శ్మశానవాటికలకు గతంలో కొత్తచెరువులో 50 సెంట్లు, లింగారెడ్డి పల్లిలో 60 సెంట్లు, బైరాపురంలో 73 సెంట్లు, కంచెట్టిపల్లిలో 75 సెంట్లు కేటాయించారే కానీ ఆన్‌లైన్ చేయలేదన్నారు. కావున ఇప్పుడు ఆ స్థలాలను చూపించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.

కర్నాటకలో 'పది' పరీక్షలు ప్రారంభం

తొలి రోజు 47 మంది విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి-పావగడ

కర్నాటక రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు నిర్వహించిన కన్నడ భాష పరీక్షకు తాలూకా పరిధిలో 2,740 మందికి గానూ 2693 మంది హాజరు కాగా 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొలి రోజు కావడంతో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నోటీసు బోర్డులో హాల్ టికెట్ నంబర్, పరీక్ష గదిని సరి చూసుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుమిగూడారు. పరీక్ష కేంద్రాలను డిడిపిఐ గిరిజ, క్షేత్ర విద్యాశాఖ అధికారి ఇంద్రాణమ్మ పరిశీలించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు శాఖ పటిష్ట భద్రత కల్పించారు.

రైతులు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని ప్రతి రైతు రైతు సేవా కేంద్రంలో తప్పకుండా విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి షాదాబ్ సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక వేపమానిపేట రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. సచివాలయం పరిధిలో ఎంతమంది రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య చేయించుకున్నారు, ఇంకా చేయించుకోని వారు ఎంతమంది ఉన్నారు, తదితర అంశాలపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా రైతులకు తెలియజేసి రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు యూనిక్ ఐడి నెంబర్ ఇస్తామ న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అమలు చేసే సంక్షేమ పథకాలు నేరుగా రైతుల ఖాతాలో జమ అవుతాయన్నారు.

'విద్యుత్ బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలి'

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీకి పెను ప్రమాదం పొంచి ఉందని సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆర్టీసీ బస్టాండ్‌లో కార్మికులతో కలిసి విద్యుత్ బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలి అనే బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల జోలికి వస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఇకనైనా ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.


బుక్ లెట్ విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

క్వారీ బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-సోమందేపల్లి


ప్రజలతో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి

స్థానిక పెద్ద చెరువులో ఏర్పాటుచేసిన క్వారీ వల్ల నష్టపోయిన రైతులకు ఒప్పందం మేరకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి శుక్రవారం చేనేత, భవన నిర్మాణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి మండలంలోని నల్లగొండరాయనిపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. హరి మాట్లాడుతూ నల్లగొండరాయనపల్లి గ్రామానికి చెందిన సుమారు 26 మంది రైతులు సోమందేపల్లి చెరువు కింద పంటలు సాగు చేస్తున్నారన్నారు. క్వారీ కార్యకలాపాల వల్ల పంటలకు నష్టం వస్తుండేదన్నారు. దీంతో రైతులు నిరసన తెలుపగా క్వారీ యజమాని 2017 నుంచి 2027 వరకూ పదేళ్ల పాటు ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని అగ్రిమెంట్ రాసిచ్చి ఐదేళ్లు మాత్రమే చెల్లించి 2021 నుంచి ఇవ్వడం లేదన్నారు. క్వారీ యజమాని తక్షణమే రైతులకు గత ఐదేళ్ల నష్టపరిహారం చెల్లించాలని, లేనిచో వారికి న్యాయం జరిగేంత వరకూ పోరాడుతామన్నారు. అలాగే హంద్రీనీవా కాలువ ద్వారా సోమందేపల్లి పెద్ద చెరువును నింపి తాగు, సాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కురుబ భాస్కర్, చేనేత కార్మిక సంఘం నాయకులు రాజగోపాల్, శీలా నారాయణస్వామి, కొండా వెంకటేష్, బెస్త కిష్టప్ప, కుమ్మర కిష్టప్ప, రవి, నాగరాజు, రైతులు విజయభాస్కర్, రామకృష్ణ, గోపాల్, వెంకటేష్, రామచంద్ర, జయకృష్ణ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వార్డులో సిపిఎం బృందం పర్యటన


పాడైన బోరును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని 26వ వార్డులో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఆలకుంట మారుతి, అయూబ్‌ఖాన్, జెవి.రమణ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పెద్దన్న విలేకరులతో మాట్లాడుతూ 22 ఏళ్లయినా ఈ వార్డులో నేటికీ పూర్తిస్థాయిలో తాగునీరు, వీధి లైట్లు, రోడ్లు, డ్రెయినేజీ, తదితర కనీస వసతులు కల్పించకపోవడం ప్రజల దౌర్భాగ్యమన్నారు. ఆయా సమస్యలను పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రావడం తప్ప ఆ తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. బోరు పాడవడంతో తాగునీరు పది రోజులకోసారి వదులుతున్నారని, వేసవిలో నీటి ఎద్దడి మరింత తీవ్రంగా ఉంటుందన్నారు. ఈ నెల 25వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమంలో ఆయా సమస్యలను అధికారులకు వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఖాదర్‌బాషా, సిఐటియు నాయకులు హైదర్‌వలి, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రిన్సిపల్ సురేష్ బాబు తెలిపారు. నైపుణ్య సమీకరణ, జీవనోపాధుల పెంపుదల ధ్యేయంగా 'సంకల్పం' పేరుతో శుక్రవారం ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆన్‌లైన్ ద్వారా పాల్గొని పలు సూచనలు చేశారు. డిఆర్‌డిఎ పిడి నరసయ్య మాట్లాడుతూ జిల్లాలోని కళాశాలలు, ఇండస్ట్రీలు సంయుక్తంగా పని చేసి యువతకు ఉపాధి అవకా శాలు కల్పించే దిశగా ముందుకు సాగాలన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో ఇండస్ట్రీ నైసర్గిక స్వరూపం, ఉద్యోగావకాశాలపై యువతకు తెలపాలన్నారు. ఎపి నైపుణ్యా భివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ మాట్లాడుతూ ప్రతి కళాశాల ఇండస్ట్రీతో ఎంఒయు చేయాల న్నారు. ప్రోగ్రాం రీసోర్స్ పర్సన్ టి.శ్రీనివాసులు ప్రస్తుత సమాజంలో విద్యార్థులపై ఉపాధ్యాయుల పాత్ర, టెక్నాలజీ, తదితర అంశాలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కియా పరిశ్రమ ప్రతినిధి పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు తెలిపారు. అనంతరం హాజరైన వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలు ఇండస్ట్రీల ప్రతినిధులు, మానవ వనరుల ఎగ్జిక్యూటివ్‌లు, వివిధ డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలల ప్రిన్సిపల్స్, తదితరులు పాల్గొన్నారు.

25న 'చలో కలెక్టరేట్' : సిపిఎం

ప్రజాశక్తి-పెనుకొండ


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీ చేపట్టిన 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణం లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాయకులు హరి, బాబావలి, గంగాధర్ విలేకరుల సమావేశం లో మాట్లాడారు. అర్థాంతరంగా ఆగిన జగనన్న ఇళ్లు, టిడ్కో గృహాలను తక్షణం పూర్తి చేసి లబ్ధిదారు లకు అప్పగించాలన్నారు. అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. లైనింగ్ పనులను ఆపి హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో శ్మశానవాటికకు ప్రత్యేకంగా భూమిని కేటాయిం చాలని, సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. సర్దుబాటు పేరుతో ప్రజలపై వేస్తున్న విద్యుత్ ఛార్జీల భారాన్ని రద్దు చేయాలన్నారు. ప్రజా సమస్యలపై చేపట్టిన చలో కలెక్టరేట్‌లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ముఖ్యఅతిథులు

క్విజ్ ఫెస్టివల్‌లో చిన్నారుల ప్రతిభ

ప్రజాశక్తి-బత్తలపల్లి

చిన్నారుల్లో దాగి ఉన్న మేధాశక్తిని వెలికి తీయడానికి ఆర్‌డిటి సంస్థ శుక్రవారం స్థానిక సంస్థ ఫీల్డ్ కార్యాలయంలో ఏరియా లెవల్ క్విజ్ ఫెస్టివల్ నిర్వహించారు. బత్తలపల్లి, ముదిగుబ్బ, ధర్మవరం, మామిళ్లపల్లి, కొత్తచెరువు మండలాల్లోని 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 40 మంది పాల్గొన్నారు. ముదిగుబ్బ, ధర్మవరం, బత్తలపల్లి ఏరియా విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ముఖ్యఅతిథులుగా ఆర్‌డిటి ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహన మురళి, రీజినల్ డైరెక్టర్ ప్రమీల హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా విద్యలో రాణించాలని, క్విజ్ పోటీల్లో మంచి ప్రతిభ చాటి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం క్విజ్ పోటీల విజేత చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్విజ్ మాస్టర్లు, నాగభూషణ, వెంకటేశులు, ఆయా ఏరియాల ఎటిఎల్స్, ఎస్టిఎల్స్, ఆర్ఈలు, సీవోలు, సిబిటిలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సచివాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-తలుపుల



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మండలంలోని ఓబుల్‌రెడ్డిపల్లి గ్రామ సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం నిర్వాహకులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వివిధ పనుల కోసం సచివాలయం వచ్చే ప్రజలు, రోడ్డు మార్గాన వెళ్లే ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి సుమియా, నాయకులు దివాన్ వలి, సచివాలయ సిబ్బంది భరత్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బత్తలపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రక్తహీనత, వడదెబ్బపై పుట్టపర్తి పిహెచ్‌సి వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం కల్పించారు. రక్తహీనత రాకుండా విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేశారు. అలాగే రక్తహీనత, వడదెబ్బ లక్షణాలు, వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చన్నారు. వేసవి దృష్ట్యా వీలైనంత వరకూ ప్రయాణాలు కానీ, పనులు కానీ ఉదయం 10 లోపు మధ్యాహ్నం 3 గంటల తరువాత ఉండేటట్లు చూచుకోవాలన్నారు. పలు జాగ్రత్తలను సూచిం చారు. ఎవరైనా అస్వస్థకు గురైతే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మి పతి, ఆరోగ్య కార్యకర్త రాధ, ఎం ఎల్ హెచ్ పి సత్యమ్మ ఆశా కార్యకర్తలు శ్రీదేవి,లక్ష్మీదేవి పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో పి-4పై అవగాహన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని పలు వార్డు సచివాలయాల్లో శుక్రవారం టిడిపి వార్డు ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బందితో కలిసి పబ్లిక్ ప్రయివేట్ పీపుల్ పార్టనర్షిప్(పి-4)పై సభలు నిర్వహించారు. ఈ సభలకు ముఖ్య అతిథులుగా టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, హిందూపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంగౌడ్ హాజరై పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు రాళ్లపల్లి షరీఫ్, రాయపాటి శివ, మాధవరెడ్డి, రహీంబాషా, కేశగాళ్ల శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.


పి-4పై అవగాహన కల్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు, టిడిపి నాయకులు

ఎమ్మెల్యేలకు వాల్మీకి బోయ సంఘం కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కదిరి టౌన్


విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి


రాష్ట్రంలో వాల్మీకి, బోయల సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే పరిటాల సునీతకు శుక్రవారం రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ సమస్యలపై 69 ఏళ్లుగా వాల్మీకి, బోయలు న్యాయబద్ధమైన పోరాటం చేస్తున్నారన్నారు. వాల్మీకి, బోయల తరఫున ఎమ్మెల్యేలు కాలవ, సునీత అసెంబ్లీలో గళం వినిపించడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గోరంట్ల


దుకాణదారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ నరేంద్రకుమార్

దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ నరేంద్రకుమార్ హెచ్చరిం చారు. ఎంపిడిఒ శుక్రవారం పట్టణంలో ప్రతి దుకాణం, హోటల్ వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్ల విక్రయం, వినియోగంపై యజమానులను హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత గ్రామ పంచాయతీగా మార్చడమే ధ్యేయంగా అందరూ సహకరించాలన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే రూ. 5వేలు జరిమానా విధిస్తామన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఎంపిడిఒ వెంట గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.


మందకృష్ణను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

మందకృష్ణకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడంతో శుక్రవారం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగను ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. పూలబొకే ఇచ్చి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 3 దశాబ్దాల కాలంలో వర్గీకరణ సాధన కోసం ఎన్నో పోరాటాలు, కేసులు, అరెస్టులు చూశామని గుర్తు చేసుకున్నారు. వాటన్నిటి ఫలితంగా నేడు విజయం సాధించామని భావోద్వేగానికి గురయ్యారు. మందకృష్ణ ఆశీర్వాదం తీసుకున్నారు.

వ్యభిచార గృహాలపై పోలీసుల దాడులు

పట్టుబడ్డ కానిస్టేబుల్, నిర్వాహకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో వ్యభిచార గహాలపై శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో నిర్వాహకులతో పాటు ఓ కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణ పరిధిలోని మోడల్ కాలనీలో బోయపేటకు చెందిన ఓ మహిళ చాలా రోజుల క్రితం కుటుంబ కలహాలతో భర్తతో విభేదించి తన పిల్లలతో పాటు ఒంటరిగా మోడల్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. గతంలో హిందూపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన కానిస్టేబుల్ పురుషోత్తంతో పరిచయం పెంచుకుని అతని ద్వారా మోడల్ కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచార గహం నిర్వహిస్తూ ఉండేది. ఈ నెల 18వ అందిన సమాచారం మేరకు వ్యభిచార గహంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. వ్యభిచార గహంలో నిర్వాహకురాలితో పాటు కానిస్టేబుల్ పురుషోత్తంలను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో బీచుగానిపల్లికి చెందిన ఈశ్వర్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు సిఐ తెలిపారు. కాగా పట్టణంలోని సీపీఐ కాలనీలో ఎస్.బాబా, అతని భార్య వ్యభిచార గహం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో వ్యభిచార గహ నిర్వాహకులు బాబాతో ఇద్దరి మహిళలను అదుపులోకి తీసుకున్నారు.

హత్య కేసులో నలుగురు అరెస్ట్

కొడవలి, బైక్ స్వాధీనం.. వివరాలు వెల్లడించిన డీఎస్పీ మహేష్

ప్రజాశక్తి-హిందూపురం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్

హిందూపురం రూరల్ మండల పరిధిలోని మలుగూరు వద్ద ఈ నెల 18వ తేదీన జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు హిందూపురం డీఎస్పీ వికె.మహేష్ తెలిపారు. నిందితులు షేక్ మహమ్మద్ షఫీ, షేక్ తౌఫిక్, రేష్మా, సలీమా అలియాస్ సల్మాలను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి కొడవలి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వివరించారు. షేక్ మహమ్మద్ షఫీ భార్య రేష్మాతో హతుడు సద్దాంబేగ్‌కు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఈ నెల 17వ తేదీన సద్దాం బేగ్ పనిచేసే ఫ్యాక్టరీ వద్ద గొడవ జరిగింది. ఈ గొడవలో మహమ్మద్ షఫీకు రక్త గాయాలయ్యాయి. దీనిపై స్థానిక వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మిగిలిన నిందితులు ద్విచక్ర వాహనంలో హిందూపురం చేరుకున్నారు. ఘర్షణ విషయం కారణంగా మర్యాద పోయిందని భావించిన ఆ నలుగురు, ఎలాగైనా సద్దాంబేగ్‌ను హతమార్చాలని పథకం రూపొందించారు. ఇందులో భాగంగా సద్దాంబేగ్ కోసం వెతుకుతుండగా ఈనెల 18వ తేదీ రాత్రి ప్రభుత్వాసుపత్రిలో ఉండగా బలవంతంగా ద్విచక్ర వాహనంలో మలుగూరు-రంగపురం రహదారి వద్దకు తీసుకెళ్లి ముందుగా తెచ్చుకున్న కొడవలితో సద్దాంబేగ్‌ను విచక్షణారహితంగా నరికి చంపారు. ఘటనపై సిఐలు జనార్దన్, ఆంజనేయులు, అబ్దుల్ కరీం, ఎస్ఐలు శ్రీధర్ ప్రత్యేక బందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం నాడు నిందితులను వన్‌టౌన్ ఇన్‌ఛార్జి సిఐ జనార్ధన్ నేతత్వంలో అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పావగడ

తాలూకాలోని దొమ్మితిమరి గ్రామ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. వెంకటాపురం గ్రామానికి చెందిన కాశీం(55) తెల్లవారుజామున 5 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై పెనుకొండకు వెళ్తుండగా దొమ్మితిమరి గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పావడగ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పావగడ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

పోస్టల్ సిబ్బందికి పార్సిల్ అప్పగింత

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఆర్టీసీ బస్సులో నుంచి పడిపోయిన పార్సిల్‌ను పోస్టల్ సిబ్బందికి అప్పజెప్పారు. గురువారం బత్తలపల్లి నుంచి కదిరి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో నుంచి రూ. 17వేల విలువ చేసే ఓ పార్సిల్ జాతీయ రహదారిపై పడిపోయింది. సమీపంలో హైవేలో పనులు చేస్తున్న ఎస్‌డి ఇన్‌ఫ్రా సిబ్బంది గమనించి పార్సిల్‌పై ఉన్న నెంబర్లకు ఫోన్ చేశారు. దీంతో శుక్రవారం ధర్మవరం పోస్టల్ సిబ్బంది బత్తలపల్లికి వచ్చి పార్సిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పార్సిల్‌ను నిజాయితీగా అప్పజెప్పిన సిబ్బందిని పోస్టల్ సిబ్బంది ప్రశంసించారు.

నేడు 'అనంత'లో శాలివాహన చక్రవర్తి జయంతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

గౌతమీపుత్ర శాతకర్ణి, కుమ్మర శాలివాహనుడు జయంతిని విజయవంతం చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా కుమ్మర శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు కుమ్మర మదనాపు పోతులయ్య పిలుపునిచ్చారు. బత్తలపల్లిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాతవాహన రాజుల్లో 23వ రాజైన శాలివాహన చక్రవర్తి జయంతిని శనివారం అనంతపురం నగర శివారులోని రాచానపల్లి వద్ద ఉన్న కుమ్మర శాలివాహన కమిటీ హాలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా తరలివచ్చి జయంతి వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE: ANANTHAPURAMU
I.A. No: 1864/2024 in A.S. No: /2024

Between:
Koppala Siva Parvathi and others
...Appellants/Defendant 1,2 & 4
And
Tallam Narayana Murthy and another
...Respondants/Plaintiff and Defendant No:3

Notice to Respondant No:2

R2: K.Aruna Kumari @ Pujari Aruna Kumari D/o Late K.Narayana Swamy, R/of D.No:14/358, SBI Colony, PRT Street, Dharmavaram.

పై నెంబరు కేసులో రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 26-03-2025వ తేది ఉదయం 10:30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
N.R.K.MOHAN, Advocate,
Ananthapuram. Cell:9440787100.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE COURT CUM JUDICIAl MEGISTRATE OF FIRST CLASS, ANANTHAPURAMU
O.S. No: 980/2020

Between:
Ramavath Paramesh Naik **...Plaintiff**
And
Veldurthi Venkata Narayana Reddy **...Defendant**

Notice to Defendant

To,
Veldurthi Venkata Narayana Reddy S/o Veldurthi Peddi Reddy, R/of D.No:4/131-4, Kesapuram Village, Kothacheruvu Mandal, Sri Sathya Sai Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 09-04-2025వ తేది ఉదయం 10:30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
ALURU RAGHAVENDRA, Advocate,
Ananthapuram. Cell:9440181500.